క్లుప్తంగా

నంబర్ ప్లేట్ లేని వాహనాలు సీజ్

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో నంబర్ ప్లేట్ లేని 8 వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. సోమవారం ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలను రోడ్లపై నడిపితే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

సమ్మె నోటీస్ అందజేత

రుద్రూర్: ఫిబ్రవరి 16న కార్మిక సంఘాలు తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్ సమ్మెను విజయవంతం చేయాలని ఆశా కార్యకర్తలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం రుద్రూర్ పీహెచ్‌సీ వైద్యాధికారిణి అయేషా సిద్ధిఖీకి సమ్మె నోటీసు అందజేశారు. సీఐటీయూ నాయకుడు నన్నేసాబ్, యూనియన్ అధ్యక్షురాలు వాణీ, కార్యదర్శి భూలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో లయన్స్ క్లబ్(ముప్కాల్) ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 60 మందికి కంటి వైద్య పరీక్షలు వైద్యుడు భుజంగరెడ్డి ఆధ్వర్యంలో చేశారు. లయన్స్ అధ్యక్షుడు ముస్కు రాజేశ్వర్, సభ్యులు సిద్ధ రమేశ్, జక్కుల రాము, శంకర్, కట్ట మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అబాకస్‌లో విద్యార్థుల ప్రతిభ



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని క్రిష్ణవేణి పాఠశాల విద్యార్థులు నిర్మల్ జిల్లా కేంద్రంలోని విశ్వం పాఠశాలలో గత శనివారం నిర్వహించిన అబాకస్ గణితం పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. సోమవారం పాఠశాలలో విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు కూడ విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ కోట ప్రవీణ్ తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ రాజేందర్ పాల్గొన్నారు.

పశువులకు 'గొంతువాపు' టీకాలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని వెటర్నరీ ఆస్పత్రి పరిధిలో పశువులకు గొంతువాపు నివారణ టీకాలు వేసినట్లు అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జియావుద్దీన్ తెలిపారు. మొత్తం 146 పశువులకు టీకాలు వేశామన్నారు. రైతులు తమ పశువులకు కచ్చితంగా టీకాలు వేయించాలని సూచించారు. పశువైద్యురాలు రోజశ్రీ, సిబ్బంది మల్లేష్, శోభ, రైతులు పాల్గొన్నారు.

బ్యాగుల పంపిణీ

మాక్లూర్: కల్లెడి ప్రభుత్వ పాఠశాలలో ఓ స్వచ్ఛంద సంస్థ ద్వారా విద్యార్థులకు స్థానిక బీజేవైఎం నాయకులు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. చదువులమ్మ ఒడి మన వెంటే బడి అన్న నినాదంతో ఉన్న బ్యాగులను విద్యార్థులకు పంచి పెట్టారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు గంగోళ్ల ప్రణయ్ తేజ్, ఓబీసీ ఐటీ సెల్ జిల్లా కో–కన్వీనర్ సిరికొండ సాయి, బూత్ అధ్యక్షుడు మచ్చర్ల అర్జిత్, పాఠశాల చైర్మన్ సాయిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు..

నవీపేట: నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు భూపతిరెడ్డి యువ సేన ఆధ్వర్యంలో సోమవారం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. కార్యక్రమంలో భూపతిరెడ్డి యువసేన జిల్లా ప్రధాన కార్యదర్శి భీమర్తి మోహన్, మహిపాల్, సంతోష్, నిఖిల్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

'పల్లెకు పోదాం'

డొంకేశ్వర్(ఆర్మూర్): మారంపల్లిలో బీజేపీ నాయకులు సోమవారం 'పల్లెకు పోదాం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, కులవృత్తులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మళ్లీ బీజేపీనే గెలిపించాలని కోరారు. బీజేపీ మండల అధ్యక్షులు సురేందర్, రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు గంగాధర్, గంగాగౌడ్, గంగాధర్, చిన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

బాల్కొండ: వరిలో సస్య రక్షణ చర్యలు కచ్చితంగా చేపట్టాలని బాల్కొండ వ్యవసాయ అధికారి మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం నాగాపూర్లో వరిపంటను పరిశీలించి మాట్లాడారు. వరి నాట్లు వేసిన 15- 20 రోజుల మధ్యలో మొగిపురుగు, కాండం తొలుచు పురుగు నివారణ కోసం కార్టప్ హైడ్రాక్లోరైడ్ ఫ్లస్ ఇమామెక్టిమ్ బెంజాయిట్ మూడు కిలోలు లేదా క్లోరాంత్రనిపోలు గుళికలు నాలుగు కిలోలు చల్లుకోవాలన్నారు. 40 నుంచి 60 రోజుల మధ్యలో మొగి పురుగు నివారణకు కార్టప్ హైడ్రాక్లోరైడ్ 400 గ్రాములు లేదా క్లోరాంతం నిప్రోలు 60ఎంఎల్ ఏదైనా ఒక దానిని 200 లీటర్ల నీటిలో పిచికారీ చేసుకోవాలన్నారు. ఏఈవో రేష్మ పాల్గొన్నారు.

శిథిలావస్థలో ప్రభుత్వ పాఠశాలలు

- మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలం
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన విద్యనందిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వాలు మౌలిక వసతులు కల్పించడంలో విఫలమయ్యాయి. గత ప్రభుత్వం మన ఊరు మన బడి పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మేజర్, మైనర్ మరమ్మతులతో పాటు ఫర్నిచర్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేసిన పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. మండలంలో 21 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 41 ప్రాథమిక పాఠశాలలు, ఒక ప్రాథమికోన్నత పాఠశాల ఉన్నాయి. మొత్తం 7,378 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మన ఊరు– మన బడి పథకం ద్వారా ఆర్మూర్ పట్టణంతో పాటు మండలంలోని 22 పాఠశాలలకు నిధులు మంజూరు కాగా ఇప్పటి వరకు మూడు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించారు. మిగతా 19 పాఠశాలల్లో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఈ పథకానికి ఎంపిక కాని గోవింద్‌పేట్, చేపూర్, ఫత్తేపూర్ ఉన్నత పాఠశాలలు, కొటార్మూర్, అంకాపూర్, రాంపూర్, దేగాం, జిరాయత్ నగర్‌లోని ప్రైమరీ పాఠశాల పరిస్థితి అధ్వానంగా ఉంది. వర్షం పడితే తరగతులు నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. పాఠశాలల్లో టాయిలెట్స్ లేకపోవడంతో అత్యవసరాలు తీర్చుకోవడానికి విద్యార్థులు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే కొన్ని పాఠశాలలకు ప్రహరీ లేకపోవడంతో పోకిరీలకు అడ్డాగా మారాయి. హరితహారంలో నాటిన మొక్కలకు రక్షణ లేకుండా పోయింది. మొక్కలు పశువుల పాలవుతున్నాయి. వర్షాకాలంలో పాములు సైతం వస్తుండటంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం సర్కారు బడుల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తే తప్ప విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం లేదు.



ఫత్తేపూర్ పాఠశాలలో పెచ్చులూడిన సీలింగ్

ప్రతిపాదనలు పంపాం

శిథిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు గదులు నిర్మించడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. గత సంవత్సరం మన ఊరు– మన బడి కార్యక్రమానికి పట్టణంతో పాటు మండలంలోని 22 పాఠశాలలు ఎంపికయ్యాయి. మూడు పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. మిగతా పాఠశాలల్లో పనులు కొనసాగుతున్నాయి.

– రాజ గంగారాం, ఎంఈవో, ఆర్మూర్

ధర్మ రక్షణకు కృషి చేయాలి



ఏకచక్ర గోశాలలో గోవులకు పూజలు చేస్తున్న ఎంపీ అర్వింద్, బీజేపీ నేతలు

- ఎంపీ ధర్మపురి అర్వింద్

బోధన్ రూరల్: హిందు ధర్మం, సంప్రదాయల పరిరక్షణకు మనందరం కృషి చేయాలని ఎంపీ అర్వింద్ అన్నారు. సోమవారం బోధన్‌లోని శ్రీ సంకట విమోచన గణపతి, శ్రీ చక్రేశ్వర శివాలయం, గోశాలను ఆయన సందర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. హిందూ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న కాంగ్రెస్‌ను ప్రజలు ఆదరించడం లేదన్నారు. అందుకే పలు రాష్ట్రాల్లో ఆ పార్టీ అధికారం కోల్పోయిందని పేర్కొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో హిందు ధర్మాన్ని రక్షించుకుంటామన్నారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణంతో దేశ ప్రజల కలను మోదీ సాకారం చేశారన్నారు. మధురలోని శ్రీకృష్ణ, కాశీలో పరమేశ్వరుని ఆలయాలు సైతం త్వరలో పునః నిర్మాణం జరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. హిందు వ్యతిరేక శక్తులతో బోధన్‌లోని పురాతన ఆలయాలు ధ్వంసం అయ్యాయన్నారు. త్వరలో వాటిని పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు. బోధన్‌లో శివాజీ విగ్రహం ఏర్పాటుకు గత ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ఇబ్బందులు పెట్టారన్నారు. ఇప్పుడు జాతీయ జెండా పెట్టేందుకు ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. అనంతరం ఆయన ఏకచక్ర గోశాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. గోశాల కమిటీ సేవలు అభినందనీయమని ఎంపీ అన్నారు. గోశాల నిర్వాహకులు తమ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్‌రెడ్డి, నర్సింహరెడ్డి, కౌన్సిలర్ వినోద్, బాల్‌రాజ్, నేపాల్ సింగ్, వినోద్ పట్వారి, రాజేష్, ఇనాని, రాంరెడ్డి, చరణ్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రభుత్వం స్పందించాలి

మాక్లూర్: ఆయా కళాశాలల హాస్టళ్లలో చోటు చేసుకుంటున్న విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేస్తూ ధర్మ స్టూడెంట్ యూనియన్(డీఎస్‌యూ) మండల నాయకుడు నితిన్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని డక్‌ఫారం వద్ద రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కొద్ది సేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. యూనియన్ జిల్లా కన్వీనర్ సాగర్ మాట్లాడుతూ..భువనగిరి ఎస్సీ హాస్టల్, సూర్యాపేట గురుకుల కళాశాల, నారాయణ వంటి కళాశాలల్లో హాస్టల్ విద్యార్థుల ఆత్మహత్యలు ఎక్కువయ్యాయని అన్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదని విమర్శించారు. బాధిత కుటుంబాలకు రూ.50 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. నాయకులు ఉదయ్, వంశీ, కావ్య, అవంతిక, సౌందర్య, ధర్మసమాజ్ పార్టీ నాయకులు ప్రేమ్ కుమార్, అనిల్, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



రాస్తారోకో నిర్వహిస్తున్న డీఎస్‌యూ నేతలు

అధికారులు మౌనం వీడాలి

డొంకేశ్వర్(ఆర్మూర్): మండల కేంద్రంలో పంచాయతీ భూముల కబ్జాపై అధికారులు మౌనం వీడి చర్యలు చేపట్టాలని సర్వ సమాజ్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. తహసీల్ కార్యాలయం ముందు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం మూడో రోజుకు చేరుకున్నాయి. అధికారులు స్పందించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని, అవసరమైతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని గ్రామస్తులు స్పష్టం చేశారు. పంచాయతీ భూములకు ఫెన్సింగ్ వేసే వరకు దీక్షలు కొనసాగిస్తామన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



బోధన్‌రూరల్(బోధన్): బోధన్ పట్టణంలోని రాకాసీపేట్ కాలనీ మున్సిపల్ తాగునీటి శుద్ధీకరణ కేంద్రంలో వెలసిన సంకట విమోచన గణపతి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం 6వ వార్షికోత్సవం పురస్కరించుకుని ఆలయ అర్చకులు శ్రీనివాస్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ దేశాయ్, ఆలయ కమిటీ ప్రతినిధులు, కాలనీపెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి

పద్మశాలి కులదైవం భక్త మార్కండేయ జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించారు. మార్కండేయునికి దోలారోహణం నిర్వహించి భక్తి పాటలు పాడారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. –సాక్షి నెట్‌వర్క్



బాల్కొండలో మంగళహారతులిస్తున్న మహిళలు



నవీపేటలో ..



ఆర్మూర్‌లో దోలోత్సవం నిర్వహిస్తున్న పద్మశాలీలు

పరిసరాల శుభ్రతపై శ్రద్ధ చూపాలి

మాక్లూర్: పరిసరాల శుభ్రతపై గ్రామాల్లోని ప్రజలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా సోమవారం డీకంపల్లిలో ఎంపీడీవో జె క్రాంతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పరిశుభ్రత లోపించటం వల్లే గ్రామీణ ప్రాంతాల్లో విషజ్వరాలు వస్తున్నాయని అన్నారు. ప్రతి సంవత్సరం మార్చి, ఏప్రిల్ నెలలోనే మలేరియా వంటి వ్యాధులు ప్రబలటానికి దోమలే కారణమన్నారు. వీధుల్లో మురికి నీరు గుంటలు ఉండటం వల్లే దోమల బెడద ఎక్కువ అవుతుందన్నారు. వీటన్నింటిని గ్రహించే పక్షం రోజుల పాటు గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మండల ప్రత్యేక అధికారి జె ముత్తెన్న, పంచాయతీ ప్రత్యేక అధికారి గులాబ్ సింగ్, పంచాయతీ కార్యదర్శి దినేష్, ఎంపీటీసీ కాలగడ్డ లక్ష్మి, మాజీ సర్పంచ్ సాధుల్ సవితలు పాల్గొన్నారు.



డీకంపల్లిలో చెత్తాచెదారం తొలగిస్తున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, అధికారులు, సిబ్బంది

పారిశుధ్యం అధ్వానం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలో రెండు నెలలుగా పారిశుధ్యం అధ్వానంగా తయారైందని, పుర ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జీవీ నర్సింహారెడ్డి అన్నారు. పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. పలు కాలనీలలో దోమల బెడదతో అనేక మంది రోగాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ అధికారులు కాలనీల వైపు కనీసం కన్నెత్తి చూడడం లేదని ఆరోపించారు. దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో నాసిరకం భోజనం

ఎడపల్లి(బోధన్): ఎమ్మెస్సీ ఫారం అంగన్‌వాడి కేంద్రంలో నాసిరకం భోజనం పెడుతున్నారని గ్రామానికి చెందిన మహమ్మద్ జైనుద్దీన్ ఆరోపించారు. నాసిరకం భోజనం తిన్న తన మనవడుఆసిఫ్ వారం రోజుల క్రితం అస్వస్థతకు గురయ్యాడని తెలిపారు. సోమవారం అంగన్‌వాడి సెంటర్‌కు వెళ్లి తన మనవడికి అన్నం పెట్టాలని టీచర్ కోరగా ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల పప్పుచారును ఇవ్వడంతో జైనుద్దీన్ జీపీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. నాసిరకం భోజనం విషయంపై ఎడపల్లి తహసీల్దార్, జీపీ కార్యదర్శికి వివరించారు. స్పందించిన కార్యదర్శి స్వప్న అంగన్‌వాడి సెంటర్‌ను పరిశీలించి సంబంధిత టీచర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నారులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. మరోసారి ఇలాంటి తప్పులు జరిగితే ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తానని కార్యదర్శి హెచ్చరించారు.



భోజనాన్ని చూపుతున్న బాధితులు

ముగిసిన కబడ్డీ పోటీలు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్ గ్రామంలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అబ్బ రాజేశ్వర్ స్మారక జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో సుర్బిర్యాల్, కొత్తపల్లి జట్లు తలపడగా సుర్బిర్యాల్ జట్టు ఆరు పాయింట్ల తేడాతో ఘన విజయం సాధించింది. కాంగ్రెస్ పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. నిర్వాహకులు అబ్బ దిలీప్, రాకేష్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి మోహన్ దాస్, కోశాధికారి సంకెపల్లి గంగాధర్, నగేష్, తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులను అందజేస్తున్న కాంగ్రెస్ నేత అన్వేష్ రెడ్డి

రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటాలి

బాల్కొండ: రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు తరపున సత్తా చాటాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంద్యాల లింగయ్య అన్నారు. సోమవారం ముప్కాల్ మండల కేంద్రంలో చైతన్య నెహ్రూ యువజన సంఘం క్రీడా మైదానంలో రాష్ట్ర స్థాయి అండర్–16 బాలుర, బాలికల జట్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 16 నుంచి 19 వరకు సూర్యాపేట్ జిల్లాలో 33వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు రెండు రోజుల పాటు ఇక్కడ శిక్షణ ఇస్తామన్నారు. జిల్లా కబడ్డీ అసోషియేషన్ ఉపాధ్యక్షుడు గంగాధర్, పీడీ రాజుకుమార్, స్థానికులు సాయన్న, రిటైర్డ్ ఉపాధ్యాయులు అంజయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో కబడ్డీ అసోసియేషన్ సభ్యులు

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

నవీపేట: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సంగెం శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో గైనకాలజిస్ట్ అందుబాటులో లేకపోవడంతో గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ సతీష్, వైద్యాధికారి సాగ్రమాట్‌ను నిలదీయగా..ఆయన డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్తానని సమాధానమిచ్చారు. బినోల పీహెచ్‌సీలో అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలని నిజాంపూర్ ఎంపీటీసీ కృష్ణమోహన్ ఎంపీపీ దృష్టికి తీసుకువచ్చారు. చేసిన పనులకు బిల్లులు ఇంకా రాలేదని పలు గ్రామాల ఎంపీటీసీలు ఇన్‌ఛార్జి ఎంఈవోను నిలదీశారు. గృహజ్యోతి పథకం సర్వేను మరికొన్ని రోజులు పొడిగించాలని ఎంపీటీసీ సతీష్ కోరారు. సర్పంచుల పదవీకాలం ముగియడంతో వారికి ఉండే అధికారాలను ఎంపీటీసీలకు బదిలీ చేయాలని పలువురు ఎంపీటీసీలు కోరారు. ఎనిమిదేళ్లుగా నవీపేట ఎంపీడీవోగా విధులు నిర్వహించిన సయ్యద్‌సాజిద్ అలీ కామారెడ్డికి బదిలీ కావడంతో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయనను ఘనంగా సన్మానించారు. జెడ్పీటీసీ నీరడి సవిత, తహసీల్దార్ ధన్వాల్, ఎంపీవో రామకృష్ణ, ఎంపీటీసీల ఫోరమ్ మండల అధ్యక్షుడు కృష్ణమోహన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ సంగెం శ్రీనివాస్

సమాచారం..

నేడు బధిరులకు నిర్ధారణ శిబిరం

ఆర్మూర్: మండల పరిషత్ ప్రాంగణంలోని భవిత కేంద్రంలో బధిర విద్యార్థులకు నిర్ధారణ శిబిరాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి రాజ గంగారాం సోమవారం తెలిపారు. సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో హియర్ ఎస్ యు అనే స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఈ శిబిరాన్ని ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 9.30 గంటలకు ఆధార్, సదరం, మెడికల్ సర్టిఫికెట్లు తీసుకొని కేంద్రానికి హాజరు కావాలని సూచించారు.

17న ఆవిష్కరణల ఎగ్జిబిషన్

డొంకేశ్వర్(ఆర్మూర్): గ్రామీణ ఆవిష్కరణలను ప్రదర్శించడానికి ఈ నెల 17న 'వన్ డిస్ట్రిక్ట్ వన్ ఎగ్జిబిషన్' కార్యక్రమాన్ని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో నిర్వహించనున్నారు. నాబార్డు సహకారంతో నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. సాంప్రదాయ వాణిజ్య సమర్పణకు భిన్నంగా అట్టడుగు ఆవిష్కరణల కోసం మార్కెట్‌ను ఏర్పాటు చేయడం, కస్టమర్ ఎంగేజ్‌మెంట్, తదితర అంశాలపై ఈవెంట్‌ను నిర్వహించనున్నారు.

బాలికల రక్షణ అందరి బాధ్యత



బాల్కొండ: బాలికల సంరక్షణ అందరి బాధ్యతని జీసీపీవో కౌన్సిలర్ జమ్రూ అన్నారు. సోమవారం మెండోరా మండలం పోచంపాడ్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికల హక్కులపై అవగాహన కల్పించారు. సేఫ్ టచ్, అన్‌సేఫ్ టచ్, స్వయం రక్షణ అనే అంశాలను వివరించారు. బాలల సంరక్షణ జిల్లా అధికారులు జ్యోత్స్న, మాధవి, ప్రిన్సిపాల్ సుదర్శన్, అంగన్‌వాడి టీచర్స్ భూలక్ష్మి, కమల పాల్గొన్నారు.

సినిమాలు | తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	కెమెరామెన్ (తెలుగు) - 2.45 లాల్ సలామ్ (తెలుగు) - 6.00, 9.20
స్క్రీన్-2 –	ఈగల్ (తెలుగు) - 11.30, 03.00, 6.30, 9.50
స్క్రీన్-3 –	ట్రూలవర్ (తెలుగు) - 10.00 తేరి బాతోమే (హిందీ) 04.10, యాత్ర-2 (తెలుగు) -7.20, 10.15
స్క్రీన్-4 –	హనుమాన్ (తెలుగు) - 02.00,6.30, 9.50

చిన్నారులకు విటమిన్‌-ఏ పంపిణీ



బోధన్ టౌన్: అంగన్‌వాడి కేంద్రంలో విటమిన్‌-ఏ సిరప్ వేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య



ఎమ్మెస్సీ ఫారం అంగన్‌వాడి కేంద్రంలో..

జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో 9 నెలల నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు విటమిన్‌-ఏ సిరప్ వేసే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. అంధత్వాన్ని నివారించేందుకు వైద్యరోగ్య శాఖ ఆధ్వర్యంలో విటమిన్‌-ఏ సిరప్ పంపిణీ చేస్తున్నట్లు ఆశా వర్కర్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పకుండా ఈ సిరప్ వేయించాలని సూచించారు. పలువురు అధికారులు కార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షించారు. – సాక్షి నెట్‌వర్క్



కోటగిరిలో విటమిన్‌-ఏ సిరప్ వేస్తున్న హెచ్ఈవో గోవర్ధన్



డొంకేశ్వర్‌లో..

శివాలయంలో ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై గల శివాలయంలో సోమవారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని నందీశ్వర మహరాజ్ సమక్షంలో పల్లకిసేవ నిర్వహించారు.

వాసవి మాతకు లక్ష పుష్పార్చన

కమ్మర్‌పల్లి: మండలం కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయ 4వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో లక్ష పుష్పార్చన కార్యక్రమం వైభవోపేతంగా నిర్వహించారు. కుల సంఘం మహిళలు అధిక సంఖ్యలో హాజరై భక్తి శ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

రామాలయ 13వ వార్షికోత్సవం

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని మీర్జాపూర్ శ్రీరామాలయ 13వ వార్షికోత్సవ వేడుకలు ఆలయ కమిటీ అధ్యక్షుడు కొల్లూర్ కిశోర్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి అన్నదానం నిర్వహిచారు. బర్ల మధు దంపతులు పాల్గొన్నారు.